# మంత్రి-మినిస్టర్

జె.సునీల్‌బాబు



రవి, శివ బైక్ మీద వెళ్తున్నారు. ఓ సెంటర్‌లో ఎదురుగా లారీ వస్తుండడం చూసి దానిని తప్పించబోయి డివైడర్‌కి బైక్ గుద్దుకుంది. మిత్రులిద్దరూ ఎగిరి రోడ్ పక్కగా పడ్డారు. రోడ్ మీద వెళ్తున్న వందలాదిమంది ఆ దృశ్యం చూసారుగానీ, ఏ ఒక్కరూ ఆగలేదు. ఎవరి హడావుడి వారిది.

శివ అతికష్టం మీద లేచి నిలబడ్డాడు. బైక్ నడిపిన రవికి దెబ్బలు బాగానే తగిలాయి. అతడికి వీలయినంత త్వరగా హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలి. కాని..ఒక్కరు..ఒక్కరూ తమకేసి చూడటం లేదు.

దారిన వెళ్తున్న ఎవరో దయామయులు స్కూటర్‌ని పక్కన ఆపి, వారి దగ్గరగా వచ్చాడు.

రవిని చూసి "అయ్యయ్యో, ఇతడిని త్వరగా హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి! 108కి ఫోన్ చేసారా?" ప్రశ్నించాడు శివను.

" లే..లేదండి... నాకేమీ తోచడం లేదు"

"అతడు మీ స్నేహితుడా?"

శివ క్షణకాలం ఆగి బదులిచ్చాడు. "అవునండి...తను మంత్రి రంగారావు గారి అబ్బాయి.."

ఆ మాట ఆ వ్యక్తి వెళ్ళిపోతున్న మరో వ్యక్తికి చెప్పాడు "ఏమండీ! మంత్రి రంగారావుగారి అబ్బాయిట యాక్సిడెంటయ్యింది."

జనం అంతగా మూగుతారని శివ అనుకోలేదు. క్షణాల్లో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారికన్నా ముందే అంబులెన్స్ వచ్చేసింది.

ఈ విషయం మీడియాకూ తెలిసిపోయింది. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని పడి వున్న బైక్‌ను, చిందిన రక్తాన్ని రకరకాల యాంగిల్స్‌లో కెమెరాలో బంధించారు.

అప్పటికే మరికొందరు హాస్పిటల్ చేరుకున్నారు. సెల్‌ఫోన్ స్టూడియోకి కనెక్ట్ చేసి డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడించారు.

"పేషెంట్‌కి ప్రాణాపాయం లేదు. కాకపోతే తీవ్రంగా గాయాలయ్యాయి. డాక్టర్స్ వెంటనే ట్రీట్‌మెంట్ మొదలుపెడుతున్నారు. "

శివ అప్పటివరకూ జరుగుతున్న తతంగమంతా చూస్తున్నాడు.

చాలాసేపటి తర్వాత ఓ జర్నలిస్ట్ అతడికి దగ్గరగా వచ్చాడు. మైక్ ముందు పెట్టి అడిగాడు "యాక్సిడెంట్ ఎలా జరిగింది?"

అతడు జరిగిన విధానమంతా వివరించాడు.

".....మరి ఈ విషయం మంత్రి రంగారావుగారికి చెప్పేసారా?"

"చెప్పానండి!ఆల్రెడీ ఆయన వచ్చేసారు. అదిగో ఆ మూల నిలబడివున్నారు చూడండి..ఆయనే మంత్రి రంగారావు"

కెమెరా అప్పుడే ఆయన వైపు తిరిగింది. ఆయనకు వెనుక సెక్యూరిటీ లేదు. బక్కపలుచగా, పెరిగిన గడ్డంతో వున్న ఆయన...ఆయన మంత్రా?!

"ఆయన..ఆయనేనా మినిస్టర్ రంగారావు?" అనుమానంగా అడిగాడు జర్నలిస్ట్.

"మినిస్టర్ రంగారావుకాదండీ! మంత్రి రంగారావు"

జర్నలిస్టుకి చిరాకేసింది "అదేలేవయ్యా! మినిస్టర్ అన్నా, మంత్రిగారన్నా ఒక్కటేగా?

శివ కూడా చిరాకు పడ్డాడు. "అదెలాగవుతుందండీ! మినిస్టర్ అంటే మంత్రి. కాని ఈయన మినిస్టర్ కాదు..."

"మరి మంత్రి రంగారావు.....అంటున్నారు"

"అవునండీ! ఈయన మంత్రి రంగారావుగారే..మంత్రి అన్నది వారి ఇంటి పేరు"

"ఆ!"

★